

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి



కోల్‌కత్తాలో జరిగిన లాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా మహిళా వైద్యులకు సరైన రక్షణ కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యుల రక్షణకు బలమైన రక్షణ చట్టాలు తీసుకు రావాలి. నిరంతరం రోగులకు సేవలందించే మహిళా వైద్యులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ శ్రీలత, గైనకాలజిస్టు, పీలేరు

భద్రతా చట్టాలు పటిష్టం చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయి చేసుకోవడం ఎంత నేరమో అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం, అమర్యాదగా మాట్లాడడం చేసే వారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణరక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం రావాలి.

– డాక్టర్ భారతి, డెర్మటాలజిస్టు, మదనపల్లె

వైద్యులకు భద్రత కల్పించాలి



వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారి వెంట వచ్చే సహాయకులు కొన్ని సమయాలోల అనుచితంగా ప్రవర్తించి వైద్యులను, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తుంటారు. ఊహించని పరిణామాలను ఎదుర్కోవడం కష్టం. అలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండాలి. అత్యవసర వార్డుల వద్ద పోలీసు భద్రత పెంచాలి.

– డాక్టర్ రాధిక, సైక్రియాటిస్టు, మదనపల్లె

చట్టాలు కఠినంగా ఉండాలి



ప్రజలకు వైద్య సేవలు అందించే వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. మారుతున్న కాలానుగుణంగా రక్షణ కల్పిస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. అటువంటి దుర్ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ పురుషోత్తం నాయక్, మెడికల్ ఆఫీసర్, పెద్దతిప్పసముద్రం

క్లుప్తంగా

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

నిమ్మనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వెంగంవారిపల్లె పంచాయతీ గొల్లపల్లె వద్ద రెడ్డిశేఖర్(35) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. మంగళవారం బాలినాయనపల్లె సమీపంలోని గొల్లపల్లె వద్ద మద్యం విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకొని సుమారు రూ.2వేల రూపాయల విలువైన 36 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అద్దెకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో వ్యాపార సముదాయానికి ఇచ్చిన 49 సెంట్లు భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండరు ద్వారా దక్కించుకున్న ఖాదర్‌బాషాకు స్థలాన్ని కొలతలు వేసి అప్పగించారు. ఇంకా బస్టాండు పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను వ్యాపారస్తులకు అవసరాలకు అద్దెకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్టీసీ ఏఈలు లక్ష్మీనారాయణ, కోటేశ్వర్‌రావు, ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ కేఎన్ బాలాజీ

పెద్దతిప్పసముద్రం : ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అలవరచుకోవాలని ఎంపీడీఓ కేఎన్. బాలాజీ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని బూర్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతుల ద్వారా విద్యనభ్యస్తున్న పదవ తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం మలుపు తిరిగేది పదవ తరగతి నుంచే అన్నారు. దురలవాట్లకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా భవిష్యత్‌లో ఏం సాధించాలనుకుంటారో అది సాధించాలన్నారు. ఆయన వెంట హెచ్ ఎం బాలసంజీవ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల రీవెరిఫికేషన్



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : మండలంలో ఓటర్ల రీవెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ భీమేశ్వర్ రావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల చేర్పులు, మార్పులు చేపట్టాలని ఆదేశించారు. పెళ్లి అయి వేరే ఊర్లకు వెళ్లిన వారిని, మృతి చెందిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ కల్యాణ మండపానికి సహకారం అందించండి

మదనపల్లె సిటీ: స్థానిక అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆలయం ప్రాంగణంలో నిర్మించనున్న కళ్యాణ మండపంకు దాతలు సహాయ,సహకారాలు అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు

- నియోజకవర్గంలో 600 ఎకరాల్లో సాగు
- వెంటాడుతున్న వర్షాభావం
- అన్నదాతలను ప్రభుత్వమే ఆదుకోవాలి



ట్యాంకర్లతో నీరు పడుతున్న రైతులు

పీలేరు నియోజకవర్గంలో వేరుశనగ సాగు

మండలం	వేరుశనగ సాగు (ఎకరాల్లో)
పీలేరు	1725
కేవీపల్లె	1750
వాల్మీకిపురం	1125
కలకడ	487
గుర్రంకొండ	288
కలికిరి	725
మొత్తం	6100

పీలేరు : ఓ వైపు తీవ్ర వర్షాభావం, మరోవైపు ఎండల ప్రతాపంతో వేరుశనగ పంట ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పీలేరు నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంట అయిన వేరుశనగ 6100 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వేరుశనగ సాగు చేయడానికి ఒక ఎకరానికి ప్రాథమిక దున్నకాలకు రూ. 1500, ఎరువులు రూ. 6 వేలు, ఆఖరి దుక్కి రూ. 1500, విత్తనాలకు రూ. 5 వేలు, భూమిలో విత్తనాలు వేయడానికి కూలీ రూ. 1200, కలుపుతీతకు రూ. 3 వేలు మొత్తం రూ. 18200 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. నేలను బట్టి, ఎరువుల వాడకం బట్టి ఖర్చు ఇంకా పెరిగే అవకాశం ఉంది. రైతులు అప్పో సప్పో చేసి వేరుశెనగ సాగు చేసిన రైతుల పట్ల వరుణ దేవుడు కణికరించలేదు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నెల రోజుల పైగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఎక్కడ చూసినా వేరుశెనగ పొలాలు ఎండిపోతూ దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల రైతులు సొంతంగా ట్యాంకర్లతో పొలాలను తడుపుతూ పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. మిగతా రైతులు ఏమిచేయలేని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పంట రక్షణకు చర్యలు చేపట్టాలి



వర్షాభావంతో ఎండిపోతున్న వేరుశనగ పంటను కాపాడుకోవడానికి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టాలి. 19–19–19 రసాయనిక ఎరువును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున ఎకరానికి 200 లీటర్లు పిచికారి చేయాలి. అలాగే యూరియా ద్రావణం పిచికారి చేసి పంటను కొంతకాలం కాపాడుకోవచ్చు.

– వై.వి. రమణరావు, ఏడీఏ, పీలేరు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎంతో ఆశతో వేరుశనగ పంట సాగు చేయడం జరిగింది. అయితే నెల రోజులు పైగా వర్షాలు పడకపోవడంతో ఎటు చూసి పంట ఎండిపోతోంది. ఎండిపోయిన వేరుశెనగ పంటను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.

– శివ, వేపులబైలు, పీలేరు మండలం

వేరుశనగ సాగుతో రూ. 40 వేలు నష్టం



రెండు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేయడం జరిగింది. అయితే వర్షాలు పడక పోవడంతో పంట ఎండిపోతోంది. పంట ఎండిపోయిన తరువాత వర్షాలు పడినా ప్రయోజనం ఉండదు. సాగు ఖర్చు చేసిన రూ. 40 వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మదనమోహన్‌రెడ్డి, ముదుపులవేముల యల్లంపల్లె, పీలేరు

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని ఫిర్యాదు



డీఎంహెచ్‌ఓ కొండయ్యకు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ తదితరులు

మదనపల్లె : ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నడుపుతూ పేదప్రజలను దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ కొండయ్యకు బహుజన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు పునీత్ ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయనను కలిసి ప్రైవేట్ ఆస్పత్రిల దోపిడీపై వివరించారు. మదనపల్లె పట్టణంలో దాదాపు 50 ఆస్పత్రులకు ప్రభుత్వ అనుమతులు లేవని, ఏమాత్రం సురక్షితం లేని భవనాల్లో వీటిని నిర్వహిస్తున్నారన్నారు. చాలా ఆస్పత్రుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోగా, సర్టిఫైడ్ స్టాఫ్ లేరన్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు బీవైఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామన్నారు. రెండురోజుల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన చిన్నారి సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటన జరిగిందన్నారు. పట్టణంలో చాలామంది వైద్యులు కేవలం ధనార్జనే ధ్యేయంగా ఆస్పత్రులు నడుపుతున్నారని, వీరి దోపిడీ నుంచి ప్రజలను కాపాడాలని వినతి చేశారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు శశికుమార్, నందీష్, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

వాగును పూడ్చివేసిన రియల్టర్లు



కడప-బెంగళూరు హైవేపై వాగు కల్వర్టును పూడ్చివేసిన రియల్టర్లు

మదనపల్లె : మండలంలోని చిప్పిలి సమ్మర్‌స్టోరేజి సమీపంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వేస్తున్న ఓ లేఅవుట్ స్థలంలో వెళుతున్న వంకను రియల్టర్లు పూడ్చివేసి చదునుచేసిన ఘటనపై మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. పొన్నూటిపాళ్యం పంచాయతీలోని ఎర్రచేను చెరువు నుంచి తుమ్మల కాలువకు వెళ్లేందుకు 60 అడుగుల వెడల్పుతో చాలాకాలంగా వాగు ఉందన్నారు. వాగుకు ఇబ్బంది లేకుండా చాలాకాలం క్రితమే కడప-బెంగళూరు జాతీయరహదారిపై కల్వర్టును నిర్మించారన్నారు. అయితే రియల్టర్లు ఇవేమీ పట్టించుకోకుండా వాగు తమ పట్టాభూమిలో ఉందని, చదును చేసేశామన్నారు. దీనిపై స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఖాజాబీని వివరణ కోరితే.... వాగులు, వంకలు ప్రైవేట్ స్థలాల్లో ఉన్నప్పటికీ వాటి స్వరూపాన్ని మార్చేందుకు ఎవ్వరూ ప్రయత్నించకూడదన్నారు. ఎర్రచేను చెరువుకు వెళ్లే వాగు పూడ్చివేతపై మండల సర్వేయర్‌ను పంపి పూర్తిస్థాయిలో సర్వే చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా....ప్రతి సమావేశంలో చెపుతుంటే... అధికార పార్టీ అండదండలతో తెలుగుతమ్ముళ్లు మాత్రం యథేచ్ఛగా వాగులు, వంకలు పూడ్చేసి ఆక్రమణలకు పాల్పడటంపై చిప్పిలి గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లె : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం రాచవేటివారిపల్లె పంచాయతీ సమీపంలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన ఉప్పుతోళ్ల వినోద్‌కుమార్(39)కు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు సీజ్ చేశారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం పట్టుబడిన ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ నరసింహుడు పేర్కొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ తనిఖీ



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

కలికిరి : మండలంలో ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ ప్రక్రియను తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ రీ వెరిఫికేషన్‌లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. అలాగే ఇప్పటి వరకు జరిగిన వెరిఫికేషన్ రికార్డులను పరిశీలించి, తహసీల్దార మహేశ్వరి బాయిని విచారించారు. కార్యక్రమంలో డీటీ నవీన్, వీఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



తిరుమాఢవీధుల్లో విహరిస్తున్న స్వామివారు

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం వద్ద రోహిణి నక్షత్రంను పురస్కరించుకొని శ్రీ కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ పాండు రంగ విఠలేశ్వర స్వామి వారు తిరుచ్చిపై అధిరోహించి, వాల్మీకి క్షేత్రంలోని తిరుమాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు క్రిష్ణ భట్టార్, బాషికాచార్యులు, రాజు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నీలి మేఘమా...జాలి చూపుమా



ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రం వేళ చల్లని గాలులతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. నీలి మేఘాలతో పాటు తెల్లటి దొంతరలతో నిండిపోయింది. వర్షం కురుద్దామా, వద్ద అన్నట్లుగా ఉంది. మదనపల్లె పట్టణం అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం మేఘాలు దోబూచులాడాయి. ప్రజలు ఎంతో ఆశతో నీలి మేఘమా.. జాలిచూపుమా అంటూ ఆకాశంవైపు ఎదురు చేశారు.

- మదనపల్లె సిటీ

ఉపాధికి దేశంలో అపార అవకాశాలు

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బి.కొత్తకోట ఆస్పత్రిలో మొక్క నాటుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

బి.కొత్తకోట : చదువుకున్న వారికి దేశంలో అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక విద్యార్థి కాన్సెప్ట్ హైస్కూల్‌లో మదర్‌థెరీస్సా జయంతి సందర్భంగా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యావంతులు ఉద్యోగాల కోసమే ఎదురుచూడాల్సిన పరిస్థితులు ప్రస్తుతం లేవన్నారు. ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విషయాలపై అవగాహన కలిగించి కొత్త ఆలోచనలతో ముందుకు సాగేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను బోధించే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపైనా ఉందన్నారు. ఒత్తిడితో చదవొద్దని విద్యార్థులను కోరారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, అక్రమ మద్యం, ఎర్రచందనం అరికట్టేందుకు ప్రత్యేకంగా ఆరు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. డైనమిక్ చెక్‌పోస్టులతో నిరంతరం నిఘా ఉంచామన్నారు. శాంతిభద్రతల సమస్య లేదన్నారు. స్థానిక సీహెచ్‌సీని సందర్శించి వైద్యురాలు హసీనాబేగంతో మాట్లాడారు. సీఐ రాజారెడ్డి, విద్యార్థి హైస్కూల్ నిర్వాహకులు ఉమారమణ, భారత్ స్కూల్ నిర్వాహకులు శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ పర్వీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ : నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. నేత్రదానం చే యడం వల్ల మరొకరికి వెలుగును ప్రసాదించిన వారవుతారన్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8వతేదీ వరకు జాతీయ నేత్ర దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేత్రదానం చేద్దాం–అంధులకు కంటిచూపును ప్రసాదిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలోజిల్లా అంధత్వ నివారణ అధికారి రియాజ్‌బేగ్, ఆప్తలమిక్ ఆఫీసర్లు డాక్టర్ ఆజాద్, అర్జున్‌రెడ్డి,హెచ్‌ఎం సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది ఖమర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తతో ఆరోగ్య సంరక్షణ

పశు సంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

కురబలకోట : పశు, జంతు, జీవాల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పశు సంవర్ధక శాఖ డీడీ కె. సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక అంగళ్లు పశు వైద్యశాలలో ఏడీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బి.కొత్తకోట, కురబలకోట మండలాల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు, పారా స్టాఫ్, ఎహెచ్‌ఎలు, గోపాలమిత్రలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో వైద్య సేవలు, చికిత్సలు అందజేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయం తర్వాత పశు సంపదే రైతులకు జీవనాధారమన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. గొంతువాపు వ్యాధి, చిటికె వ్యాధి, ఫుట్ అండ్ మౌత్ తదితర వ్యాధులకు ముందస్తుగా టీకాలు వేయాలన్నారు. పశువుల బీమా, గోకులం తదితర అంశాలపై సమీక్షించారు.

కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

ఏఓ నాగప్రసాద్



మాట్లాడుతున్న ఏఓ నాగప్రసాద్

మదనపల్లె : మారుతున్న కాలంతో పాటుగా ఆహారపు అలవాట్లను మార్చుకుని, పోషక విలువల గురించి తెలుసుకుని, వాటిని మన ఆహారంలో భాగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగప్రసాద్ తెలిపారు. మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాలెం ప్రాథమిక పాఠశాలలో వాస్సన్ సంస్థ ఆధ్వర్యంలో ఆహారం–ఆరోగ్యం–ఆకు కూరలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటిని ఆహారంలో ఎలా భాగం చేసుకోవాలో వివరించారు. పోషకాహార లోపంతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న క్రమంలో తక్కువ ఖర్చుతో పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే అనారోగ్య సమస్యలను తగ్గించుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 106 రకాల ఆకుకూరలు, కూరగాయల ప్రదర్శనలో, వేటిని ఆహారంగా తీసుకుంటే ఏఏ ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. కార్యక్రమంలో వాస్సన్ ప్రతినిధి సుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్(ఆగ్రో ఎకాలజీ) ఎం.భూదేవి, సి.నరసింహారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, స్కూల్‌చైర్మన్ నగేష్, అంగన్‌వాడీ టీచర్ హేమలత, ఏఎన్‌ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

చిట్లాకుప్ప స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



చిట్లాకుప్పస్థలం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

గుర్రంకొండ : సంక్రాంతి పండుగ దినాలలో కనుమ పండుగ రోజు ప్రజలందరు వినియోగించుకొనే చిట్లాకుప్పస్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని మండలంలోని గుర్రంకొండపంచాయతీ తలారివాండ్లపల్లె గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 15 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నామన్నారు. కనుమ పండుగ నిర్వహించుకొనేందుకు పూర్వం పెద్దలు గ్రామానికి పక్కనే రెండు ఎకరాల స్థలం ఇచ్చారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది భూస్వాములు సదరు చిట్లాకుప్ప స్థలాన్ని ఆక్రమించుకొన్నారని అన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న దివాకర్

పీలేరు : కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు మానుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ అన్నారు. మంగళవారం 'సుప్రీంకోర్టు తీర్పు అమలు – హైర్ పెన్షన్ సమస్యలు అంశంపై' పీలేరులో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్టీసీలో రిటైర్ అయిన వారికి కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలన్నారు. హైర్ పెన్షన్ ఆప్షన్‌లో పీలేరు డిపోలో 101 మందికి రిజెక్ట్ చేశారని, వారికి న్యాయపరంగా రికవరీ చేయబడిన మొత్తం తిరిగి ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కె.సి.ఎస్. రెడ్డి, జాఫర్, భాస్కర్, లక్ష్మయ్య, ఎస్‌ఎం. బాషా, రెడ్డెప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.